# అనగనగా... ఒక కథ

# అంకిత

శశిధర్‌కి పెళ్లి చేయాలని మాలతి సతాయింపు ఎక్కువవుతోంది. చంద్రం మాస్టారికి భార్య సతాయింపుని పట్టించుకోవాలని లేదు.

''27 ఏళ్లు వచ్చేసేయ్.. మనం తొందరపడకపోతే వాడే ఏ పిల్లనో పెళ్లి చేసుకుని వచ్చేస్తాడు- మీరూ నేనూ నెత్తి బాదుకోవల్సిందే''

నెలకో 60 సార్లు మొదట్లో చెప్పేది- ఇప్పుడు ఏ మాట మాట్లాడినా పల్లవిలా చెప్తోంది అదే మాటని.

''వాడికి పెళ్లా?'' చంద్రం మాస్టారు చాలా సార్లు పైకే అన్నాడు.

ఇప్పుడింక వాదప్రతివాదాలు చేసే ఓపిక లేక లోపలే అనుకుంటున్నాడు-

మాలతి తన పుట్టింటి వాళ్లని పిల్చి తన ప్రయత్నాలు తనూ కొనసాగిస్తోంది.

''అన్నయ్యా- మీ బావగారు శశిగాడి పెళ్లి సంగతి ఆలోచించరు. నాకా కాలూ చెయ్యీ ఆడినన్నాళ్లు ఆడవ్- రోజూ రోజూ బీపీ రేజయిపోతోంది-ఏ పక్షవాతమో వచ్చి మంచంలో పడితే-గుప్పెడు మెతుకులు గొంతులోకి పంపే ఆడదిక్కు లేదు'' కన్నీళ్లు కట్టలు తెగుతూండగా అర్థించింది!

''ఏంటి బావా! ప్రతీ పనిలోనూ ముందుంటావ్ పిల్లాడికి పెళ్లి చెయ్యడానికి తాత్సారం చేస్తున్నావ్. చెల్లాయి తొందరపడుతోంది'' అన్నాడు బావమరిది వరస పెద్దాయన.

''తనేదన్నా అవుతే..నాకు అన్నం పెట్టే వాళ్లుండరని దాని బాధ''

''ఈ బాధలూ బెంగలూ ఎందుకు వాడికి పెళ్లి చేసేయచ్చుగా''

''రాఘవరావూ- నీకో కూతురుందనుకో మావాడికి ఇస్తావా?''

''.....''

''నాకో కూతురుందనుకో- వీడిలాంటి వాడికి ఇస్తానా?''

''.....''

''పిల్లని ఇచ్చేవాళ్లు వేసే ప్రశ్నలకి ఎన్ని అబద్ధాలు మనం చెప్పాలి..ఆలోచించు''

''వెయ్యి అబద్ధాలాడైనా..ఒక పెళ్లి జరిపించాలంటారు'' నసుగుతూ అన్నాడు రాఘవరావు.

''నా కొడుకు కోసం పదివేల అబద్ధాలు ఆడాలి. కానీ ఒక్క నిజం గొంతు పిసుల్చుకుని చెప్పి ఒక అమ్మాయిని కాపాడాలి అనే తత్వం నాది'' అన్నాడు చంద్రం మాస్టారు.



★ ★ ★

''నిజం చెప్పే..ఆ గొంతుని నరికేస్తాను. మళ్లీ జైలుకెళ్తే వెళ్తాను! ఇంకో 13 ఏళ్లు గాల్లో కలిసిపోతాయ్'' అన్నాడు శశిధర్.

తల్లీ మావయ్యా సముదాయించారు-

''నువ్వంటే నాన్నకి ఇష్టంరా! తన కొలీగ్ని- ఇంటర్మీడియట్‌లో నువ్ హత్య చేసి జైలుకెళ్లావ్..అంటే ఆయన మనస్సు ఒప్పుకోగలదా- తట్టుకోగలదా చెప్పు'' అంది మాలతి.

''అయిపోయిన గొడవ వదిలెయ్ చెల్లాయ్! దేవుడు..దానికి ఓ శిక్ష విధించాడు. 13 ఏళ్లు అజ్ఞాతవాసం అయిపోయింది'' అన్నాడు రాఘవరావు.

''మావయ్యా- నాకు శిక్ష విధించిందీ..అజ్ఞాత వాసమో, కారాగార వాసమో ఏర్పాటు చేసింది కోర్టు-జడ్జీ కాదు. మా నాన్నే!''

''ఆ గొడవ వదిలెయ్యమన్నాను కదా! నువ్ ఏదో ఉద్యోగం చూసుకో- పెళ్లి చేసుకుని పెళ్లాన్ని పోషించే స్థాయికి రా''

''పెళ్లీ-పెళ్లాన్ని పోషించడం ముఖ్యం అంటావా మావయ్యా?''

''ఇంకేదిరా నీకు ముఖ్యం-చెప్పు-చెప్పురా''

ఏడుపుతో అరిచింది మాలతి.

అమ్మ ఏడుపు చూడలేకపోయాడు శశిధర్!

''సరే- అమ్మా! నాకు టేస్టు-ఇంట్రస్టులూ ఏం లేవు. నాకెవరైనా పిల్లనిస్తానని, పెళ్లి చేస్తానని ఒప్పుకున్నవాళ్లుంటే చెప్పు- నీ మాట నమ్మి తాళి కట్టేస్తాను'' శశిధర్ అన్నాడు.

ఆవిడ ప్రయత్నాలు ఉధృతం చేసింది.

★★★

''బావగారూ మీరు పెళ్లిచూపులకి వస్తే బాగుంటుంది''

''నేను రాను''

''బొట్టుపెట్టుకుని అక్కయ్య అత్తగారి హోదాలో పెళ్లిచూపులకి వస్తుంది- మీరేరని వాళ్లడిగితే చెప్పడానికి జవాబు లేదు..మా దగ్గర''

''నా దగ్గరా జవాబు లేదు- వస్తున్నాను'' అన్నాడు చంద్రం మాస్టారు.

★★★

పెళ్లిచూపుల సన్నివేశంలో మూగవాడిగా గడిపేసాడు చంద్రం మాస్టారు.

పెళ్లి ముహూర్తం నిశ్చయం అయిపోయింది.

చంద్రం మాస్టారికి కాబోయే కోడలు ఎంతో నచ్చింది!!

కాదు-చాలా నచ్చింది!! ఎంత నచ్చిందంటే తన కొడుక్కి- ఆ బంగార్తల్లి జోడీ సరికాదన్నంత నచ్చింది.

★★★

''అమ్మా'' అన్నాడు చంద్రం మాస్టారు.

''అంకుల్'' అంది వినయంగా పలకరిస్తూ ఇంటికొచ్చిన చంద్రం మాస్టార్ని.

''అంకుల్ అంటే ఏమంటమ్మా?''

''మావయ్య అని అన్నాను'' అంది పెళ్లికూతురు.

''కాదమ్మా బాబయ్యని కూడా అంకుల్ అంటారు''

''.....''

''నేను నీకు తండ్రిలా ఓ సలహా ఇవ్వడానికి వచ్చాను. నా కొడుకు మీ ఇంట్లో అందరికీ నచ్చాడు. పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు కదా!''

''అవునంకుల్''

''వద్దమ్మా మావాడు నీకు తగిన మొగుడు కాదు''

''.....''

''నీలాంటి బంగార్తల్లికి మంచి మొగుడు రావాలి. నీ మొహంలో నవ్వు ఎప్పటికీ చెరిగిపోకూడదు''

''అంకుల్...మీరనేది..''

''నీకు అర్థం కాదులే..ఏ తండ్రయినా తన కొడుకు గురించి ఉన్నతంగా చెప్తాడు. కానీ నేను చెప్పలేను. నీలాంటి కూతురు నాకుంటే నేను అలాంటివాడితో పెళ్లి చేయడానికి ఇష్టపడను. ఆ పెళ్లికొడుకు నీకు పనికిరాడని చెప్పడానికి వచ్చాను. నీకు మంచి మొగుడు రావాలి!''

''అంకుల్''

''ప్లీజ్..మావయ్యకీ-బాబయ్యకీ తేడా తెలియని పిలుపువద్దు- డాడీ అను''

''డాడీ'' అంది సుమ.

''నా కొడుకు నీకు మొగుడుగా పనికిరాడు. మా ఇంట్లో పెళ్లికి హడావుడి పడుతున్నారు. నేనొచ్చినట్లు-నీతో మాట్లాడినట్లు మా ఇంటి వాళ్లకీ మీ ఇంట్లో వాళ్లకీ తెలియనీయకు తల్లీ..ఆల్దిబెస్ట్- నీకు మంచి కుర్రాడితో పెళ్లయాక ఆశీర్వచనం తీసుకోడానికి నాకు కబురు పెట్టు!''

చంద్రం మాస్టారు వెళ్లిపోతున్నారు.

సుమ ఆయనకి వెనకనుంచే దణ్ణం పెట్టింది, కన్నీళ్లతో.

☆




